
ఉగాది పోటీలో రెండవ బహుమతి పొందిన కథ



# 1901- ఓ బలిదానం

**- కె.వి.నరేందర్**

**1901...**

మార్గశిర మాసం... చలి వణికిస్తోంది... పొగ మంచు దట్టంగా లేచింది.

సూర్యోదయానికి ముందే దొరగారి గడీలోంచి మంచు తెరల మధ్య తలనిండా తెల్ల చీర కొంగు కప్పుకొని ఇంటికి వెళ్లిపోతున్న ప్రమీలకి ఎదురయ్యాడు రాఘవరావు దొర. ఆజానుబాహుడు, ఎరుపు జీర కళ్లలోంచి శాసించినట్లు రాలిపడే చూపులు...

"ప్రమీలా..." అన్న పిలుపుతో ఆగింది.

ఎదురుగా వచ్చి నిల్చున్నాడు. గుబురు మీసాల్ని సవరించుకుంటూ నర్మగర్భంగా నవ్వుతూ అడిగాడు. అయినా హుంకరించినట్టుగా వచ్చింది రాఘవరావు మాట.

"మైతాపురం నించి వచ్చిన మా అతిథి... జాగిర్దార్ సర్వోత్తములగార్కి రాత్రి ఆతిథ్యం బాగా ఇచ్చావా?" అనడిగాడు.

"ఇచ్చానయ్యా" తలంచుకొని అంది.

"రాత్రి ఆయన మద్యం సేవిస్తున్నప్పుడు నాతో చెప్పారు. రతికేళిలో తనకేదో ఇంద్రాణిబంధం బాగా ఇష్టమని... ఆయన రేపు కూడా వుంటారు. ఆయన్ని సంతృప్తిపరుచు... గొల్లపెల్లి శివారులోని పన్నెండువందల ఎకరాల మాగాణి మనకు ధర్మనిధి కింద రాసివ్వాలని ఆలోచనతో వున్నారు..."

ప్రమీల మళ్లీ తలూపింది.

ఓ సూర్యకిరణం ముక్కు పుడక మీద పడి తళుక్కుమంది. చామనఛాయలోని ముప్పయిదేళ్ల ప్రమీల రూపం అద్భుత సౌందర్యానికి ఆత్మబింబంలా వుంటుంది. ధర్మార్థ కామాలకు ప్రణామంచేసిన వత్సాయనుడి నాలుగు జాతుల నాయికల రూపాల్ని, గుణాల్ని కలబోసుకున్న కామశాస్త్రంలోని కావ్యనాయికలా వుంటుంది. శాస్త్రతత్వం తెలిసిన పండితురాల్ల వుంటుంది.

"ఇక వెళ్లొచ్చు..." అన్నాడు.

పక్కకి తప్పుకొని ప్రణయ నాయికలా వెళుతున్న ప్రమీలని మళ్లీ పిలిచాడు.

"ప్రమీలా... నెల కింద గడీ ముందు ఊర్లోని అమ్మాయిలంతా బతుకమ్మ ఆడుతుంటే... ఓ సౌందర్యరాశి కన్పించింది. పదహారేళ్లుంటాయేమో... నేను ఆరాతీస్తే నీ కూతురని చెప్పారు. నీకో కూతురుందని ఎప్పుడూ చెప్పనేలేదు. ఏం పేరు..." అనడిగాడు.

"ప్రమీలా... నెల కింద గడీ ముందు ఊర్లోని అమ్మాయిలంతా బతుకమ్మ ఆడుతుంటే... ఓ సౌందర్యరాశి కన్పించింది. పదహారేళ్లుంటాయేమో... నేను ఆరాతీస్తే నీ కూతురని చెప్పారు. నీకో కూతురుందని ఎప్పుడూ చెప్పనేలేదు. ఏం పేరు..."

ప్రమీల కళ్ళల్లో భయం రెపరెపలాడింది. పెదవులు వణికిపోయినయి.

'సంధ్య' అంది చెప్పీ చెప్పనట్టుగా...

"సరే కాని..." అని నవ్వి "సర్వోత్తములుగారు నీ జీవితంలో ఎన్నో వ్యక్తి అన్నది గుర్తుంచుకున్నావా ప్రమీలా..." అనడిగాడు.

తెలీదన్నట్టు మౌనంగా తలూపింది.

"నువ్విప్పుడు ఘనాచారిణివి"అన్నాడు.

త్రుళ్లి పడింది ప్రమీల... బాధ, సంతోషం కలగలిపి వచ్చాయి.

"నిన్ను ఘనాచారిణిగా ప్రకటిస్తు రేపు ఊర్లో చాటింపు వేయిస్తాను" ఇకనించీ నీకు ఊర్లో జరగాల్సిన అన్ని మర్యాదలు జరుగుతాయి" అని వెళ్లిపోయాడు.

ప్రమీల తన శరీరాన్ని తడిమి చూసుకుంది. మంచుముద్దల్లా, చల్లగా వుంది... కళ్లలోంచి నీళ్లు టపటపా జారిపడ్డాయి...

తనిప్పుడు... ఘనాచారిణి!!

వంద మంది మగాళ్లచే సంభోగించబడ్డ ఆడదాన్ని ఘనాచారిణిగా ప్రకటిస్తారు. ఒళ్లంతా జలదరిస్తుంటే... తన శరీరాన్ని కుమ్మరి పురుగుల్లా తొలిచేసిన ఎందరెందరో మగాళ్ల ప్రతిబింబాలు కదలాడిపోయాయి... అక్కడక్కడా పంటి గాయాలు మిగిల్చిన మచ్చల్ని తడిమితే తన ఆర్తనాదాలు తనకే విన్పిస్తాయి.

ఇకనించి ఈ వృత్తికి పనికి రాకపోయినా... ఊరు ముత్తయిదువులా గౌరవిస్తారు. పండగలకి, పబ్బాలకి పిలిచి చీరె సారెలు

పెడతారు. శివుడి ధ్యానం చేస్తూ శివసత్తిలా మారిపోయి పూనకం వచ్చినరోజు ఊరు గ్రహచారం చెప్పాలి...

నిజానికి... ఒక్కో మగాడి సంభోగం తర్వాత మెదడు మొద్దుబారిపోయేది. కళ్లు మూసుకుపోయేవి. గట్టిగా అరుస్తూ ఊగిపోవాలన్పించేది. పూనకం రాకుండా తమాయించుకుంది ఇన్నేళ్లు...

ఇప్పుడు ఈ పాపకూపంలోంచి బయట పడటం ఆనందంగా వుంది.

ఆరేళ్ల వయస్సున్నప్పుడు వూర్లోకి గారడీ ఆడడానికి వచ్చిన తన తల్లిదండ్రులకు అర ఎకరం పొలం, పది తాటి చెట్లనిచ్చి తనని కొన్నాడట రాఘవరావ్ తండ్రి అచ్యుతరావు దొర. తను పెద్దమనిషయ్యాక గడీలకు పెద్దవాళ్లెవరొచ్చినా తనకి పిలుపొచ్చేది. వెళ్లనంటే అయ్య అవ్వ కొట్టేవాళ్లు. బలవంతంగా రాత్రిల్లు గడీల దింపేసి వచ్చేవాల్లు.

ఇన్నేళ్లకు తను నరకంలోంచి బయటపడుతోంది...

గుండె బరువు తగ్గిపోతుంటే... గడిదాటి నడిచింది ప్రమీల.

❊ ❊ ❊

రచ్చబండ దగ్గర గుసగుసలు మొదలయ్యాయి...

చాటింపు వేసేవాడికోసం వేచి చూస్తున్నారు.

ప్రతి ఒక్కడిలో ప్రమీల శరీరం పట్ల ఆసక్తి...

రాత్రిల్లు గడీవైపు వెళ్తుంటే... ఆనాటి అతిథి తానైతే బావుండు అనుకోని మగాడు ఆ వూర్లో వుండడు. రాత్రి పక్కలో మొగుడు హుషారుగా వుంటే వీడికీరోజు ప్రమీల కన్పించిందా అనుకోని ఆడదీ వుండదు.

సుబ్బయ్యశెట్టి అరవై తులాల బంగారమిస్తానన్నా... కాదన్న ప్రమీల పశువులు కాసే గోపాలంగాడికి ముద్దు పెట్టిందట అనే వార్తలు గడీని చేరిన మర్నాడు... అడవికి పోయిన గోపాలంగాడు తిరిగి రాలేదు. చిరుతపులి మింగేసిందన్న పుకారు...

అందుకే రచ్చబండ దగ్గర అందరూ బెదురు కళ్లతోనే మాట్లాడుకుంటున్నారు.

"ప్రమీలమ్మని దొరగారు ఊరి ముత్తయిదువగా ప్రకటించారహో... ఇక నుంచి ఏ ఇంట్ల పండుగైనా, పబ్బమైనా ప్రమీలమ్మకు చీరె సారెలు పెట్టాలె... చల్లంగా సూడాలె... ప్రతి ఆదివారంనాడు ఈరగోల పట్టుకొని శివాలెత్తుతది. అందరి మంచి, చెడు చెప్తదహో..." అంటూ డప్పు కొడుతూ చాటింపు వేస్తున్నాడు.

మగాళ్లలో ఆ చాటింపు ఏదో నిరాశని నింపుతోంది... ఆడవాళ్లలో ఆనందాన్ని పంచుతోంది.

"ఇంకా వయస్సైపోలేదు కదా... ఇప్పుడే ఊరి ముత్తయిదువగా ప్రకటించారెందుకో..." నిరాశగా అన్నాడొకడు. ఆ మాట విన్న ఓ ముసలమ్మ "పోనీలేరా... అదృష్టవంతురాలు... గడీలోపల ఎంత నరకం వుంటుందో నీకేం తెల్సు?" అంది జాలిగా.

"అదేం కాదు... మొన్న సింగాపురం జమీందారు వచ్చినప్పుడు... ప్రమీలమ్మను ఇష్టపడలేదట" గడీలో దీపాలు ముట్టిచ్చే శంకరిగాడు చెప్పాడు" మెల్లగా చెప్పాడు మరొకడు.

"ప్రమీల గురించి వినే వచ్చిపోయిన దొరలు చాలా మంది. అలాంటిది ప్రమీలను ఇష్టపడలేదంటే... వాడు మగాడే అయ్యుండడు" అన్నాడు ఇంకొకడు.

"అసలు విషయం అదికాదు... ఆ జమీందారు పక్కలో పడుకోవడానికి ప్రమీలనే ఇష్టపడలేదంటారు. దాంతో ఆ జమీందారు అలిగి వెళ్లితే... ఆ రాత్రి ప్రమీలమ్మని దొర బాగా కొట్టాడంటారు."

"ఎందుకై వుంటుంది...??"

"ఆ జమిందారు వయసు పద్దెనిమిదేళ్లట... నాకు కొడుకుంటూ వుంటే నీ వయసే వుండేదేమో అందుట ప్రమీల... దాంతో కథంతా అడ్డం తిరిగిందట..."

"అంతెందుకూ... కల్లెపెల్లినుంచి మునసబు వచ్చిన రాత్రి... బిగ్గరగా అరచిందట... మర్నాడు కూడా దొర బాగా కొట్టిండట..."

## రచయిత పరిచయం



**పూర్తి పేరు:**

**కందుకూరి వెంకట్ నరేందర్**

**వృత్తి:**

**ప్రధానోపాధ్యాయులు.**

**ఇప్పటివరకు అమ్మ, యుద్ధం, బురదలో జాబిల్లి, నాన్న, కాలుతున్న పూలతోట, నాతిచెరామి, ఊరు, సిటీ కథ సంకలనాలు వెలువడ్డాయి.**

**మొత్తం 200 కథలు, 3 నవలలు, 4 నాటికలు వచ్చాయి.**

**చిరునామా: కె.వి.నరేందర్,**
**7-4-264/బి, కెనాల్ దగ్గర,**
**విద్యానగర్,**
**జగిత్యాల- 505327**
**కరీంనగర్ జిల్లా.**

"అంత మంది దొరల్ని తట్టుకున్న ప్రమీల... మునసబు గాన్ని తట్టుకోలేకపోయిందా" ముసిముసిగా నవ్వుతు అన్నాడొకడు.

ఆ మాటతో అక్కడున్న ముసలమ్మ కళ్లలో సన్నని కన్నీటి పొర చిట్లిపోయింది.

"మీకేం తెల్సురా పిచ్చినాకొడుకుల్లారా... బహిష్టు బాంచెన్ అని మొక్కినా వాడు విడిచి పెట్టలేదట..." అంది బాధగా.

"బంజేరుపల్లి పట్వారి గడీలకి వచ్చిన రాత్రి కూడా ప్రమీల నిరాకరిస్తే దొర కొట్టిండట... తర్వాత బలవంతంగా ఒప్పుకుందట..."

"ఆ పట్వారీగాడేం చేసిండో..." ఇంకొకడి వెకిలి నవ్వు.

"ఓసారి ప్రమీల గడీలోనే ఆత్మహత్య చేసుకోవాలనుకుందట... అప్పుడు దొరనే కాపాడాడని అంటారు".

"అవునవును... రెండేళ్ల కిందట ఊట్నూరు జమీందార్లు వచ్చి వెళ్లింతర్వాత..." ఆసక్తిగా అన్నాడు ఇంకొకడు.

"అప్పుడేం కష్టమొచ్చిందో పాపం..." ఒకడి కళ్లలోంచి జాలి కురిసింది.

"కష్టమేముంది... ఆ పని స్వర్గసుఖమే కదా..." వెకిలిగా అన్నాడొకడు.

"ఇద్దరు మగాళ్లూ ఒకేసారి మీదపడితే... అదీ మనిషేరా... మాంసం ముద్దయిపోదూ..." ఆవేదనగా అంది ముసలమ్మ.

"ఇవన్నీ నీకెలా తెలుసే ముసల్దానా..."

"నేను పరాచికాలాడితే... కన్నీళ్లతో చెప్పుకునేదిరా..." చెప్పింది ముసలమ్మ."

ఇలా... వాళ్ల మాటలు ప్రమీల శరీరంతో ఆడుకున్నాయి... పాపిట నుంచి... పాదంవరకూ అపహాస్యంగా వర్ణించాయి... తమకు దక్కని అనుభవానికి కుళ్లుగా నవ్వుకున్నాయి... అప్పుడే రచ్చబండ దగ్గరికి ఓ పది మంది రైతులు పరుగులాంటి నడకతో వచ్చారు. వారి ముఖాల్లో ఆనందం... ఆందోళన కలగలిపి కన్పిస్తున్నాయి.

ఓ రైతు గుండెలదురుతుంటే చెప్పాడు...

"కొత్త చెరువు నిర్మాణం పూర్తయింది కదా... ఎల్లుండి అమవాస్యరోజు బలిదానమట..."

ఉలిక్కిపడ్డారంతా...

అక్కడ ఒక్కసారిగా వాతావరణం గంభీరంగా మారిపోయింది.

అందరి శరీరాల్లోనూ భయం చరాచరా పాకింది.

నరాల్లో రక్తం చప్పున చల్లబడింది...

నాలుకలు పిడుచ కట్టుకుపోయాయి... ఊరంతా ఇదే చర్చ. కొందరు తల్లులు ఏడుస్తూ బిడ్డల్ని గుండెలకదుముకున్నారు.

"వూర్లోంచి ఎవరూ పారిపోకుండా... పొలిమేరల్లో యాభై మంది పాలేర్లను దొర కాపలా పెట్టిండు"అన్నాడు మరో రైతు.

"కట్టమైసమ్మకు మనిషిని బలిచ్చుడు ఆచారమే నాయె... దున్నపోతుని కూడా తెగనరికి నెత్తురుని వూరంతా చల్లాలి... లేకపోతే కట్టతెగి వూరు మునుగుతది..." భయంగానే అన్నాడు మరో రైతు.

"ఎవరి పేరు చెబితే వారిని కొత్త చెరువు కట్టకింద... గోతిలో పూడ్చి పెడతారు... బలిచ్చిన కుటుంబానికి దొర ఎకరం భూమిని ఇనాం ఇస్తాడు..."

"కట్ట కింద ఎనిమిది వందల ఎకరాలు దొర భూమే కదా వుంది... ఎకరం పోతే ఏంటట?" రైతుల మాటలతో ఓ యువకుడు ఆవేశంగా అన్నాడు. కాని అతనికి దొర గురించి చెప్పి భయపెట్టి నోరు మూయించారు.

"బలిదానమయ్యే వాని పేరు ఎవరు చెప్తారు?" మరో వ్యక్తి అడిగాడు.

"దేవత."

"దేవతెవరు...?"

"ఆరోజు పూనకమచ్చే దేవత... ఈసారి ప్రమీలమ్మకి పూనకమొస్తుందట..."

ప్రమీలమ్మ...!!! అప్పటివరకూ అంగాంగ వర్ణన చేసిన వాళ్లందరి అవయవాలు చచ్చుబడిపోయినట్లయింది.

"బిడ్డా... బలిదానమిచ్చుటానికి దొరగాని పేరు చెప్పు..." వంగి పోయిన నడుముతో గొణుక్కుంటూ వెళ్లిపోయింది ముసలమ్మ.

గాలి, నీరు స్తంభించిపోయినట్టు... ఊరంతా కనురెప్పల శబ్దంకూడా విన్పించనట్టు భయంతో నిశ్శబ్దమైంది.

మరణాన్ని శాసిస్తున్న ఉగ్రరూపమై... ఊరంతా ప్రమీలమ్మ కన్పిస్తోంది... ఇన్నాళ్లూ వెలివేసిన చూపులన్నీ ప్రాణభిక్ష పెట్టమని... మౌనంగా ప్రార్థిస్తున్నాయి...

❊ ❊ ❊

అమావాస్య రోజు...

పొద్దున్నే... కొత్త చెరువుదగ్గరికి వూరంతా చేరింది. చెరువుకి నాలుగు మూలలా నాలుగు మేకపోతుల్ని బలిచ్చారు. పసుపు కుంకుమలు గాల్లోకి ఎగిసిపడుతున్నాయి.

చెరువు తూము పక్కనే కట్టివేసిన బలిష్టమైన దున్నపోతు... భయంగా చూస్తోంది. దాని పక్కనే ఆరడుగుల గొయ్యి...

**(మిగతా 19వ పేజీలో)**

(8వ పేజీ తరువాయి)

గొయ్యి ముందు బోర్లించిన పచ్చికుండ... దానిమీద నిల్చుండి దేవత బలికోరుతోంది... ఇంతలో డప్పుల హోరు దగ్గరైంది... పిల్లలు ఉలిక్కిపడి ఏడుస్తున్నారు.

శివమెత్తిన ప్రమీలమ్మ పరిగెత్తుకొస్తుంది... మొహమంతా పసుపు... జుత్తు విరబోసుకొంది... చేతుల్లో వేప మండలు... ఈరగొలను నడుముకు చుట్టుకుంది. తలపై వున్న మట్టి కంచుడులోని నిప్పుల మీద చల్లిన గుగ్గిలం వాసన ఘాటుగా వస్తోంది.

వందలాది డప్పుల శబ్దం భయం గొల్పుతోంది... డప్పుల శబ్దానికనుగుణంగా ఉగ్రతాండవం చేస్తూ వచ్చింది... పచ్చి కుండ మీద ఒంటి కాలిపై నిలబడింది... నిప్పు కళ్లతో జనాన్ని చూసింది. జనమంతా రెండు చేతులెత్తి దండం పెట్టారు...

డప్పుల చప్పుడు ఆగిపోయింది...

"ఒహోహోయ్..." అని కేక పెట్టింది.

గుబురు మీసాలున్న ఓ మంత్రగాడు గుగ్గిలం పొగను మొహానికి పట్టాడు. దేవుడు నిండుకున్న ప్రమీలమ్మ పాటందుకుంది...

"కట్టువోత రారా... నా కన్న కొడకా... పెట్టువోత రార నా పెద్దకొడకా. రాత రాసినోడా... ఆరి బమ్మదేవా... తల్లి పార్వతమ్మా... తండ్రి శంకరుడా... నీకు పదివేల శరణే..."

ప్రమీలమ్మ పండ్లు పటపట కొరికింది.

జనమంతా తల్లీ... శరణు...శరణు అని మొక్కారు.

'ఆరాలు దప్పితె గోరాలునాయి... గోరాలు తప్పితే ఆరాలు నాయి... లందల పుట్టి బొందల పెరిగిందాన్ని...కార్తీక రాజుల రక్తం తాగిందాన్ని... కోటొక్క పూజల కొలువున్నదాన్ని... కొలుచుకున్నోల్లకు కొంగు బంగారాన్ని... నరలోకాన్ని నమ్మరాదే..."

దేవతలందర్నీ తలచి లొట్టలువేస్తూ నోటితో గండ్రుమని గాలిపీలుస్తూ.. రౌద్రంగా వూగిపోయింది.

"బలి... బలి... బలి... బలి గావాల్రా..." అని గాండ్రించింది.

"నీకు ఎవరుగావాలో చెప్పు..." మంత్రగాడు గుగ్గిలాన్ని పసుపుని నిప్పులమీద కసిగా విసురుతూ అడుగుతున్నాడు... బలికావాల్రా... అంటూ అరగంట సేపు సతాయించింది... జనం బిక్కచచ్చిపోయి చూస్తున్నారు...

"ఎవరు బలికావాలో చెప్పు... పేరు చెప్పు తల్లీ" మంత్రగాడు హుంకరిస్తున్నాడు.

"పడమటి దిక్కుల్ల... పరుపు వనాల కింద... పులిమిన దిక్కుల్ల... పురిటి వనాల కింద... పులిచింత చెట్టుకింద... బంతి పువ్వోలె బాల కూసున్నది... అది కావాలె..." గర్జించింది.

ప్రమీలమ్మ చెప్పిన వైపు పది మంది వేగంగా పరిగెత్తారు...

"దున్నపోతు రక్తంతో వూరికి బందానం వెయ్యాలె... ఉడుకుడుకు రక్తాన్ని ఊరి పొలిమేరల్ల, ఇండ్లమీద వాడలల్ల చల్లాలె..." రోషంగా చెప్తూనే వుంది.

"బలి జీవిని తెస్తున్నారు..." ఎవరో గట్టిగా అరిచారు.

దిక్కులు పగిలిపోతున్నట్టు... డప్పుల శబ్దం మళ్లీ హోరెత్తింది...

వాళ్లు తీసుకొస్తున్న వ్యక్తిని చూసి... ఊరంతా నోరు తెరిచింది... గుండెలవిసిపోయి కన్నీళ్లు ఎగిసొచ్చాయి... పూల పూల బతుకమ్మలా వస్తున్న... సంధ్య! పట్టు లంగాలో పాలరాతి బొమ్మలాంటి సంధ్య!

ప్రమీలమ్మ బిడ్డ!!

మంత్రగాడు ఎదురెల్లి గుగ్గిలం పొగని మొహమ్మీద కొట్టాడు... మగతగా స్పృహతప్పింది.

వెంటనే నలుగురు కల్సి ఎత్తుకొచ్చి గోతిలో పడుకోబెట్టారు... కొందరు ఆడవాళ్లు దుఃఖం ఆపుకోలేక గుండెలు బాదుకున్నారు.

ప్రమీలమ్మ శివాలెత్తుతూ భయంకరంగా వూగిపోయింది... ముక్కోటి దేవతల్ని తలిచింది...

మోకాళ్లమీద వంగి... దోసిలితో మట్టి తీసి బిడ్డమీద పోసింది... వెంటనే నలుగురు గొయ్యిని వేగంగా పూడ్చేస్తున్నారు.

మంత్రగాడు పదునైన గండ్రగొడ్డలి తెచ్చి ప్రమీలమ్మ చేతిలో పెట్టాడు...

డప్పులు భయంకరంగా శబ్దం చేస్తున్నాయి...

అడుగులో అడుగేసుకుంటూ... దున్నపోతు దగ్గరికి నడిచింది...

అరమోడ్పు కన్నులతో దాన్ని చూసింది... దాని ముఖంలో రాఘవరావ్ దొర ముఖం కన్పించింది...

అంతే... కదిలిపోయింది... కాళికలా... కంపించిపోయింది...

ఒక్క వేటుతో దాని తల తెగి... రక్తం ఎగజిమ్మింది.

జనం గిన్నెలతో కుండలతో ఎగబడ్డారు... ఇల్లమీద చల్లుకోవడానికి ఊర్లోకి పరిగెడుతున్నారు.

అరగంట తర్వాత... అక్కడెవరూ లేరు...

పూడ్చిన గోతిమీద ప్రమీలమ్మ మాత్రమే పడిపోయి వుంది... ఒంటరిగా...

"బిడ్డా... పొత్తికడుపులో పిడిబాకులు గుచ్చినట్టు...
పచ్చి కుండని కొలిమిలో కాల్చినట్టు...
ఊడలమర్రి కింద జెర్రులు పాకినట్టు...
దొరగాని కన్ను పడింది... ఆ నరకం నీకొద్దు బిడ్డా..."

ప్రమీలమ్మ దుఃఖంతో... ఆ మట్టి తడిసిపోతోంది!!

★

---

**(11వ పేజీ తరువాయి)** తరవాత ఆమె అతీగతీ పట్టించుకున్నారా? చిన్నతనంలోనే అంతటి నిస్వార్థ సేవా నిరతిని అలవరచుకున్న అభాగిని తనమీద కనపరచిన నిండైన భక్తికి, విశ్వాసానికి ప్రతిగా ఆయన కూడా ఆమె యోగక్షేమాలను కొంతలో కొంతయినా కనిపెట్టారా?

మనకు తెలిసినంతలో అలాంటిదేమీ జరగలేదు. సత్యవతిని కలిసి ఆరు రోజులయ్యాక 1929 ఏప్రిల్ 29న వసుమతి అనే ఆశ్రమ వాసినికి మహాత్ముడు రాసిన ఈ లేఖే సత్యవతికి ఆయన ఇచ్చిన విలువ ఏమిటో చెబుతుంది:

"You contributed money on the very day you adopted me as your father... Your contribution of money has no value in my eyes. In that way I have deprived several women of their possessions. I am not sorry for that, and do not even remember clearly many of these occassions. During this tour I took away from one Satyavati who had been recently widowed all her Jewellery, and I felt no compunction. But would she take a pledge and keep it? It would be good of she did... ..."

[**Collected Works of Mahatma Gandhi**, Vol.45, #400, PP 412-413]

*(నన్ను నీ తండ్రిగా దత్తుచేసుకున్న రోజునే నువ్వు డబ్బు విరాళంగా ఇచ్చావు... నా దృష్టిలో నీ విరాళానికి విలువ లేదు. ఆ రకంగా నేను చాలామంది మహిళల నగానట్రా లాగేశాను. అందుకు నేనేమీ విచారించడం లేదు. ఆ సందర్భాలేమిటో కూడా నాకు గుర్తుండవు. ఈ టూరులోనే నేను కొత్తగా వితంతువైన ఓ సత్యవతి దగ్గర నగలన్నీ తీసేసుకున్నాను. అందుకు నాకు చింత లేదు. కాని ఆమె సత్యాగ్రహ శపథం తీసుకుని నిలబడుతుందా? నిలబడితే మంచిదే... ...)*

నగల మీద, నగదు మీద వ్యామోహం లేదు లేదంటూనే ఎక్కడికి వెళ్లినా, ఎవరు కనపడ్డా 'ఏమిస్తావ్? ఇంకేమిస్తావ్? ఇంకా తే' అంటూ పీడించటం మహాత్ముడి ప్రత్యేకత. ఎంత వసూలైనా తృప్తిపడక ఇంకా కావాలనటం, తనకు ఎవరో ప్రేమతో ఇచ్చిన ఫౌంటెన్ పెన్నులను, దండలను, భరిణెలను, ఆఖరికి సన్మాన పత్రాలను కూడా వేలంవేసి, స్వయంగా తానే పాటను నిర్వహించి, అందినంత రాబట్టటం ఆయన వెళ్లినచోటల్లా సర్వసాధారణం. ఇందాక మనం చెప్పుకున్నవి ఎక్కువగా 1920'లలో గాంధీగారు నడివయసులో ఉన్నప్పటి ముచ్చట్లు. అలాగని ముదిమి మీద పడ్డాక వసూళ్ల రంధి ఆయనలో అణగిందీ లేదు. మరణించడానికి మూడునెలల ముందు గాంధీని సర్దార్‌పటేల్ ఆటపట్టించిన ఈ కింది ఉదంతమే అందుకు ఉదాహరణ:

అక్టోబరు 11న పంచాంగం ప్రకారం గాంధీజీ పుట్టినరోజు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని గుజరాతీలు ఆయనకు పర్సు బహూకరించడానికి రిసెప్షను ఏర్పాటుచేశారు. గాంధీజీ అప్పటికింకా జలుబు, ఫ్లూతో బాధపడుతున్నారు. అయినా మీటింగుకు వస్తానని చెప్పారు. సర్దార్‌పటేల్ ఆయనను తీసుకు వెళ్లడానికి వచ్చేటప్పటికి కూడా ఆయన తెరపి లేకుండా దగ్గుతూనే ఉన్నారు. అప్పుడు-

The Sardar chaffed him: "There is no end to your greed! To collect a purse you will leave even your deathbed! All things will take care of themselves, if only you take care of your cough. But you will not listen."

At the meeting the Sardar... with affectionate banter proceeded: "See, how quickly the old man has recovered his strength to relieve you of your money in spite of his illness. Now have some mercy on him and let him rest."

*[Mahatma Gandhi: The Last phase* Part-II **Pyarelal**, P.P 459-460]

*(సర్దార్ ఆయనతో మేలమాడాడు: "మీ ఆశకు అంతు లేదు. పర్సు వస్తుందంటే మీరు మరణశయ్య మీంచి కూడా లేచొస్తారు. మీ దగ్గు సంగతి మీరు చూసుకుంటే చాలు. అన్నీ బాగానే అవుతాయి. కాని మీరు వినరు."*

*మీటింగులో కూడా సర్దారు ప్రేమ పూర్వకంగా హాస్యమాడుతూ "జబ్బును కూడా లెక్కచెయ్యక మీ నుంచి డబ్బును గుంజటంకోసం ముసలాయన ఎంత త్వరగా బలం పుంజుకున్నాడో చూడండి. ఇకనైనా ఆయనను దయతలిచి కాస్త విశ్రాంతి తీసుకోనివ్వండి" అన్నారు.)*

★